సాక్షి
తిరుపతి

బుధవారం । 9 । జూలై । 2025



చిల్లకూరులో రొట్టెల పండుగ

నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు అనుబంధంగా చిల్లకూరులో ఒక్కరోజు నిర్వహించే రొట్టెల పండుగకు భక్తులు పోటెత్తారు. - 8లో



చంద్రగిరిలో క్రీడలకు శిక్షణ

క్రీడా రంగంలో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి చంద్రగిరిలో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



తిరువణ్ణామలై వెళ్లి వస్తూ..

తిరువణ్ణామలైకి కారులో వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారుడు మృత్యువాత పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు వైఎస్ జగన్ పర్యటన ఇలా..



చిత్తూరు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో మామిడి పంటకు కనీస మద్దతు ధర రాకపోవడం, ఫ్యాక్టరీల వద్ద మామిడితో రైతులు రాత్రింబవళ్లు బారులు తీరి ఉండడం, కొన్ని చోట్ల పంటను అలాగే చెట్లల్లోనే వదిలేయడం లాంటి ఘటనల నేపథ్యంలో ఆయన రైతులకు మద్దతుగా నిలిచేందుకు విచ్చేయనున్నారు. ఈ మేరకు ఆయన బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు.

- ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్‌లో బంగారుపాళ్యంకు బయలుదేరుతారు.
- 10.50 గంటలకు బంగారుపాళ్యం మండలంలోని కొత్తపల్లె గ్రామం జాతీయ రహదారి పక్కన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి.. 11.20కి రోడ్డు మార్గం గుండా బంగారుపాళ్యం మామిడి కాయల మార్కెట్ యార్డుకు చేరుకుంటారు.
- 11.20 నుంచి 12.20 గంటల వరకు మామిడి రైతుల కష్టాలపై బంగారుపాళ్యం మామిడి యార్డులో రైతులతో నేరుగా మాట్లాడనున్నారు.
- 12.20 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి.. 12.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.45 గంటలకు బంగారుపాళ్యం కొత్తపల్లెలోని హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళ్లనున్నారు.

నేటి నుంచి యోగా టీచర్స్ శిక్షణ శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న పతంజలి యోగా సమితి ప్రతినిధి స్వామి రితదేవ్

తిరుపతి కల్చరల్ : యువతకు మంచి ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు తిరుపతి ఆరోగ్యకరమైన నగరంగా రూపొందించాలనే ఉద్దేశంతో పతంజలి బాబా రామ్‌దేవ్ ఆదేశాలతో తిరుపతిలో ఈనెల 9వ తేదీ బుధవారం నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు 25 రోజుల పాటు అసిస్టెంట్ యోగా టీచర్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి జాతీయ కోఆర్డినేటర్ స్వామి రితిదేవ్ తెలిపారు. మంచినీళ్ల గుంట వద్దనున్న విద్యోదయ ఎడ్యుకేషనల్ సెంటర్‌లో ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసిన వారికి హరిద్వార్‌లో వారం రోజుల పాటు బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు కైలాస్ సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు హరికుమార్, సోమశేఖర్, మహిళా యోగా సమితి విభాగం రాధిక, ఉమ పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు అజ్ఞాత వ్యక్తుల బెదిరింపు

రేణిగుంట : మండలంలోని గాజుల మండ్యం పంచాయతీలో నివాసం ఉంటూ.. వడమాలపేట మండలంలోని ఎస్‌వీ పురం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న భూపతిని గత వారంలో కొందరు వ్యక్తులు రూ.20 లక్షలు కావాలని బెదిరింపునకు దిగినట్లు తెలిపారు. వీఆర్వోకు సంబంధించిన కొన్ని ఆధారాలు ఉన్నాయని బ్లాక్ మెయిల్ చేసినట్లు సమాచారం. వారికి వీఆర్‌ఓ రూ.1.50 లక్షలు మొదటి విడతగా ఇచ్చారు. మళ్లీ రూ.5 లక్షల డిమాండ్ చేయడంతో గత శనివారం వీఆర్వో తిరుపతి ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వీఆర్వోతో కలిసి స్టింగ్ ఆపరేషన్ చేసి బ్లాక్ మెయిల్ చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్‌లో గత శనివారం నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి గోప్యంగా విచారిస్తున్నారు. అసలు వీఆర్వో చేసిన తప్పు ఏమిటి..? వీఆర్వోని ఏమి చూపించి బ్లాక్ మెయిల్ చేశారు..? ఎందుకు వీఆర్‌ఓ వారికి రూ.1,50,000 ఇచ్చారు...? అసలు బ్లాక్‌మెయిల్ చేసిన వారు ఎవరు, ఎంతమంది అనే విషయాలు తెలియాల్సి ఉంది. గాజుల మండ్యం పోలీసులను వివరణ కోరగా కేసు విచారణలో ఉందని, ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.



వైఎస్సార్ ఫొటోలను చేత పట్టి జేజేలు పలుకుతున్న భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు

మరపురాని మహానేత

దివంగత నేత, మనసున్న మహారాజు, పేదల పాలిట దేవుడైన వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఊరూరా నేతలు, అభిమానులు, కార్యకర్తలు పండుగలా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కేక్ కటింగ్‌లు, అన్నదానం, రక్తదాన శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మహానేత పాలనను గుర్తుకు చేసుకొని, తమకు అందిన సంక్షేమ ఫలాలతో ప్రాణాలతో బయటపడ్డామని, ఉన్నత చదువులు చదివామని, మంచి ఉద్యోగాలు సాధించామని, అప్పుల ఊబి నుంచి బయట పడ్డామని గుర్తుకు చేసుకొని కార్యకర్తలు, ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఊరూరా రాజన్న సంబరాలు

- ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- పలుచోట్ల అన్నదానం, రక్తదాన శిబిరాలు
- కేక్ కటింగ్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు
- వైఎస్సార్‌ను గుర్తుచేసుకున్న అభిమానులు
- కేక్ కటింగ్‌లు, అన్నదానాన్ని అడ్డుకున్న పోలీసులు

తిరుపతి అర్బన్ : దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని జిల్లాలో ఊరూరా జరుపుకున్నారు. ప్రమాదంతో ఆయన ప్రజలకు దూరం అయినప్పటికీ ఆయన పాలనలో చేసిన మంచిని గుర్తుచేసుకుంటూ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ప్రధానంగా వైఎస్సార్ పాలనలో అమలు చేసిన ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయంబర్స్‌మెంట్, వ్యవసాయ రుణాలమాఫీ, ఉచిత విద్యుత్ తదితర పథకాలను గుర్తుచేసుకున్నారు.

వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా పలుచోట్ల అన్నదానం , తిరుపతిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఊరువాడ తేడా లేకుండా ఆయన అభిమానులు కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అయితే ఓ మాజీ ముఖ్యమంత్రి మహానేత, పేదల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడు జయంతి ఉత్సవాల్లో కేక్ కటింగ్, అన్నదానం చేస్తుంటే నాయుడుపేట, గూడూరులో పోలీసులు అడ్డుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. అన్నదానం చేస్తే ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని పోలీసులు చెప్పడాన్ని పలువురు తప్పు పడుతున్నారు.



సూళ్లూరుపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నేతలు

- సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో పార్టీ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. అయితే ఈ సందర్భంగా అన్నదానం చేయడాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే పార్టీ నేతలు సర్ది చెప్పి కార్యక్రమాన్ని కొనసాగించారు. మరోవైపు ఆయా మండల కేంద్రాల్లో మండల నేతల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరుపుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చంద్రగిరి : పేదలకు అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

- చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ంగా చంద్రగిరి టౌన్ క్లాక్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. అలాగే పాకాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేక్ కటింగ్ చేపట్టారు. లింగేశ్వర్‌నగర్‌లోను కేక్ కటింగ్‌తో పాటు అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. రామచంద్రాపురం మండలంలోని నెన్నూరు, నిమ్మలగుంటపల్లి, ఎర్రావారిపాళెం మండలంలోని నెరబైలు, చిన్నగొట్టిగల్లు మండల కేంద్రాల్లోనూ కేక్ కటింగ్ చేపట్టారు.



గూడూరు: వైఎస్సార్ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నేతలు

- గూడూరు నియోజకవర్గం సనత్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు మురళీధర్ నేతృత్వంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా చేపట్టారు. ముందుగా గూడూరులోని బనిగేసాహెబ్‌పేటలో కేక్ కటింగ్ చేయాలని భావించారు. అయితే పోలీసులు అనుమతి లేదని చెప్పడంతో సనత్‌నగర్‌లో నిర్వహించారు. అనంతరం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు అందించారు. ఈ సందర్భంగా గూడూరు అభివృద్ధికి వైఎస్సార్ పరిపాలనలో చేపట్టిన పలు అంశాలను గుర్తుచేసుకున్నారు. ఆయా మండల కేంద్రాల్లో మండల కన్వీనర్లు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేపట్టారు. పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

నియోజకవర్గాల్లో ఇలా..

- వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఆయనతో పాటు వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పార్టీ నేతలు రవికుమార్, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేదురుమల్లి బంగ్లాలో చేపట్టిన వైఎస్సార్ జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ అనంతరం అన్నదానం నిర్వహించారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో.. పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని సినిమా వీధిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేపట్టారు. తర్వాత అన్నదానం చేశారు. రేణిగుంట మండలంలో హరిప్రసాద్ రెడ్డి, తిరుమల రెడ్డి నేతృత్వంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఏర్పేడు మండలంలో రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండలంలో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.
- సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని జరుపుకున్నారు. ప్రధానంగా నారాయణవనం, నాగలాపురం, సత్యవేడు మండల కేంద్రాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. వారితోపాటు కార్మిక విభాగం మాజీ చైర్మన్ బీరేంద్ర వర్మతో పాటు పలువురు పార్టీ నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేపట్టారు. మరో వైపు ఆయా మండల కేంద్రాల్లో మండల నేతలు పాల్గొన్నారు.

తిరుపతిలో వేడుకగా వైఎస్సార్ 76వ జయంతి వేడుకలు

- పేదలకు అన్నదానం, రక్తదాన శిబిరం ఏర్పాటు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన

తిరుపతి మంగళం : ఏళ్ల గడిచినా ఇప్పటికీ ఊరంతా నీ జ్ఞాపకాలే రాజన్నా.. పొలానికెళ్లినా..పట్టణానికి వచ్చినా నీ ప్రతిరూపాలే.. నీ పథకాలు పదిలం.. నిన్ను మేము మరువలేం! జోహార్ వైఎస్సార్.. జోహార్ వైఎస్సార్ అంటూ అభిమానులు చెమర్చిన కళ్లతో తమ అభిమాన నేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నీవు మా మధ్య లేకపోయినా మా గుండె చప్పుడు నీవ్వే రాజన్నా అంటూ స్మరించుకున్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి తుడా సర్కిల్లోని వైఎస్సార్ విగ్రహం వద్ద చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డిలతో పాటు భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ ప్లకార్డులను చేతపట్టుకుని జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. అనంతరం 76 కిలోల భారీ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ ఆధ్వర్యంలో సుమారు వంద మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం వెయ్యి మందికి పైగా పేదలకు భూమన కరుణాకరరెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆశాజ్యోతి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, తన రాజకీయ జీవితంలో ఏ ఒక్కరికి కూడ వెరవకుండా ప్రజలకు సేవ చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రతి పేదవాడికి అందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉన్నారన్నారు. వైఎస్సార్ 76వ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ రోజు వైఎస్సార్‌సీపీ ఓడిపోయిందని కూటమి నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, విధ్వంశాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని దౌర్జన్యాలు చేయించినా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడుతామన్నారు. ఇప్పటికైనా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపైన దౌర్జన్యాలు ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న భూమన అభినయ రెడ్డి



వెంకటగిరి : నివాళి అర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్, నేతలు



శ్రీకాళహస్తి : అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు, నేతలు



సత్యవేడు : అన్నదానం చేస్తున్న సమన్వయకర్త నూకతోటి రాజేష్

ఉద్యోగుల సర్దుబాటు



కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ కోసం వచ్చిన సచివాలయ ఉద్యోగులు

- బదిలీల ప్రక్రియ 5తో ముగిసినా గోప్యంగా కౌన్సెలింగ్

తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో సచివాలయాలను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంలో భాగంగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో చూస్తే 691 సచివాలయాల్లో 5,625 మంది ఉద్యోగులు పనిచేస్తుంటే.. వాటిని 353 సచివాలయాలుగా కుదింపు చేశారు. దీంతో ఉద్యోగుల మిగులు తప్పలేదు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో 1975 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఖాళీగా లేవంటూ రిజర్వులో పెట్టినట్లు తెలుస్తోంది.

ఆర్‌టీఐహెచ్‌కు కేటాయింపు

కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం 80 మంది సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ చేపట్టారు. వారిలో 20 నుంచి 30 మందిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు పంపనున్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ డిప్యూటీ కలెక్టర్లు, డీపీవో అధికారుల బృందం కౌన్సెలింగ్ చేపట్టారని వెల్లడించారు.

ఇంకా పాత స్థానాల్లోనే..

ఈ నెల 5వ తేదీకి సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ పూర్తి అయిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు బదిలీల వివరాల జాబితాను మాత్రం వెల్లడించలేదు. దీంతో బదిలీ చేసినా ఉద్యోగులు మాత్రం జాబితా విడుదల చేయకపోవడంతో పాత స్థానాల్లోనే పని చేస్తున్నారు. ఈ క్రమంలో మిగులు ఉద్యోగులను ఇతర విభాగాలకు సర్దుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈఎస్ఐసీ నమోదుకు నూతన పథకం

తిరుపతి తుడా : సామాజిక భద్రతా కవరేజీని విస్తరించే లక్ష్యంతో కార్మిక రాజ్యబీమా సంస్థ ఉద్యోగులు, యజమాన్యాల నమోదు ప్రక్రియ కోసం నూతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఈఎస్ఐ కార్పొరేషన్ రాయలసీమ ప్రాంత జాయింట్ డైరెక్టర్ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఈఎస్ఐలో నమోదు కాని సంస్థ యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులు, పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్‌పీఆర్ఈఈ) అనే పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఉద్యోగుల, సంస్థ యాజమాన్యాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాత బకాయిలకు మినహాయింపునిస్తూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేసినట్లు తెలిపారు. ఈ పథకం ఈనెల నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఉద్యోగులు, సంస్థ యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 80,081 మంది స్వామివారిని దర్శించుకోగా 28,775 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ స్పష్టం చేసింది.

మొక్కలతోనే మానవ మనుగడ

రామచంద్రాపురం : మానవాళి జీవన గమనానికి మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మండల పరిధిలో కుప్పంబాదురు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో వృక్షారోహణ -2025 కార్యక్రమాన్ని ప్రాణయోగ ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆశ్రమం వద్దకు చేరుకున్న ఆయనకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆశ్రమంలో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాణాయోగ ఆశ్రమం చూస్తే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. ప్రాణయోగ ఆశ్రమాన్ని నూతన టెక్నాలజీతో నిర్మించడం కారణంగా ఇక్కడి వాతావరణంలో కార్బన్ శాతం తగ్గించి ఆక్సిజన్ లెవెల్ ఎక్కువగా ఉందని తెలిపారు. అడవులలో మొక్కల పెంపకానికి ముందు కొచ్చిన ప్రాణ యోగ ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీకి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రాణ యోగ ఆశ్రమం ఆధ్వర్యంలో వేప, మర్రి చెట్లు నాటారు. ఆశ్రమం పక్కన ఉన్న ఫారెస్ట్ భూమిలో పచ్చదనాన్ని పెంపొందించడం కోసం 300 మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐఆర్ఎస్ అధికారిణి పాయల్ గుప్తా, డాక్టర్ సత్యనారాయణరాజు, ఎంపీడీఓ ఇందిరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ భాష, ఏపీవో సుజాత, వ్యవసాయ శాఖ అధికారిణి మమత పాల్గొన్నారు.



ఆశ్రమంలో మొక్కలు నాటి, నీళ్లు పోస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.99,920
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,033
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,10,600
రిటైల్ వెండి గ్రాము	రూ.113.60

క్లుప్తంగా

'శతాధిక' సంబరం


కేక్ కట్ చేస్తున్న రమణయ్య

చిట్టమూరు : మండల పరిధిలోని మొలకలపూడి గ్రామానికి చెందిన సంక్రాంతి రమణయ్య అనే వృద్ధుడు మంగళవారంతో వందేళ్లు పూర్తి చేసుకున్నాడు. రమణయ్యకు నేటికి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100లో అడుగు పెట్టడంతో కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ.. తాను నెహ్రూ కాలం నుంచి రాజకీయాలు చూస్తున్నానన్నాడు. అయితే దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన తనకు ఎంతగానో నచ్చిందన్నారు.

కుక్ కాంట్రాక్ట్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: వన్ స్టాప్ సెంటర్‌కు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన మల్టీపర్పస్ స్టాఫ్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ జిల్లా పీడీ వసంత బాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 14వ తేది లోపు దరఖాస్తులు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఇవ్వాలని లేదా పోస్టులో పంపవచ్చన్నారు. నెలకు వేతనం రూ.13 వేలు ఉంటుందని చెప్పారు. 18–42 ఏళ్లలోపు మహిళలు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తు ఫీజు ఓసీలు అయితే రూ.250, ఎస్సీ, ఎస్టీ, బీసీలు అయితే రూ.200 డీడీ లేదా చెక్కు రూపంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి పేరిట చెల్లించాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం ఐసీడీఎస్ వెబ్ సైట్ చూడాలని సూచించారు.

ఉపాధి సిబ్బందిపై కేసు

– విధుల నుంచి తొలగింపు

కలువాయి(సైదాపురం) : ఉపాధి ఉద్యోగులపై సస్పెన్షన్, కేసు నమోదు అయిన ఘటన కలువాయిలో చోటు చేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కలువాయి మండలంలో గతంలో పనిచేసిన ఈసీ శ్రీనివాసులు, ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, ప్రసన్న, ప్రసాద్ అనే ఉద్యోగులు రూ. 56 లక్షల అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ ద్వారా నిర్ధారణ చేశారు. నెల్లూరు డ్వామా అధికారులు ఈ నలుగురు ఉద్యోగులను పూర్తిగా విధుల నుంచి తొలగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ విషయమై నెల్లూరు డ్వామా కార్యాలయం నుంచి కలువాయి మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు అందినట్లు సమాచారం.

తిరువణ్ణామలై వెళ్లి వస్తూ..

తిరిగిరాని లోకాలకు!

- ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదం
- పాల ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- ప్రమాదంలో తల్లీ, కుమారుడు మృతి
- మరో మహిళ పరిస్థితి విషమం


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

చంద్రగిరి : తిరువణ్ణామలైలోని అరుణాచల శివయ్యను దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందగా.. మరో మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ అర్బన్, చిట్టినగర్‌కు చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మావతి, కుమారుడు జశ్వంత్ సాయి, చెల్లెలు హేమలతతో కలసి తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి కారులో వెళ్లారు. స్వామి దర్శనం ముగించుకుని మంగళవారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తొండవాడ సమీపంలో వెళ్తున్న క్రమంలో ముందు కారు నడుపుతున్న కోటేశ్వరరావు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అనంతరం కారులో ప్రయాణిస్తున్న పద్మావతి (38) అక్కడికక్కడే మృతి చెందగా.. కోటేశ్వర రావు, కుమారుడు జశ్వంత్ సాయి (21), చెల్లెలు హేమలత తీవ్రంగా గాయపడ్డారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు మృతి

ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుంది. క్షతగాత్రులకు ప్రథమ చికిత్సను అందించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆసుపత్రికి చేరుకోగానే వైద్య పరీక్షలు నిర్వహించిన అధికారులు అప్పటికే కోటేశ్వరరావు కుమారుడు జశ్వంత్ సాయి మృతి చెందినట్లు తెలిపారు. హేమలత పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. కాగా డ్రైవింగ్ చేస్తున్న తండ్రి కోటేశ్వర రావుకు ప్రమాద సమయంలో కారులోని బెలూన్‌లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్వల్పగాయాలతో కోటేశ్వర రావు


చికిత్స పొందుతున్న హేమలత


మార్గమధ్యలో మృతి చెందిన జశ్వంత్‌సాయి


ఘటనా స్థలంలో మృతి చెందిన పద్మావతి

చిల్లకూరులో రొట్టెల పండుగ


దోషాహీద్ సమాధుల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిల్లకూరు : నెల్లూరులోని బారా షాహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు అనుబంధంగా చిల్లకూరులో ఒక్క రోజు నిర్వహించే రొట్టెల పండుగకు భక్తులు పోటెత్తారు. నెల్లూరుకు వెళ్లలేని భక్తులు చిల్లకూరులోని దోషాహీద్ దర్గా వద్దకు వచ్చి తమ మొక్కుబడులును తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిల్లకూరులోని సయ్యద్ అహ్మద్‌షా, సయ్యద్ మహ్మద్‌షాలకు చెందిన దో షాహీద్ దర్గాలో రొట్టెలు వదలడం, తిరిగి పట్టుకోవడం చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని నమ్మకం . గూడూరు డివిజన్‌లోని పలు గ్రామాలకు చెందిన ముస్లింలు, హిందువులు ఇక్కడ రొట్టెలు మార్చుకోవడం విశేషం. దీంతో ఆరోగ్య ,కళ్యాణ రొట్టెను పట్టుకునేందుకు డిమాండ్ ఏర్పడింది.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో తిరుపతి, చిగురువాడ శ్రీ నిలయానికి చెందిన మైథిలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది రెడ్డప్ప నాయుడు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి జయశంకర్ నగర్‌కు చెందిన కె.సుధాకర్ రెడ్డి అయన భార్య వద్ద మైథిలి వేరువేరు తేదీలలో సొమ్మును అప్పుగా తీసుకున్నారు. దానికి గాను ఆమె సుధాకర్‌రెడ్డికి రూ.11.30 లక్షల చెక్కును 2020 డిసెంబర్ 19వ తేదీన ఇచ్చారు. ఆ చెక్కును అతను బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో సుధాకర్ రెడ్డి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మైథిలికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే అసలు, వడ్డీ కలిపి రూ.15 లక్షలా 92 వేల 944 రూపాయలను పరిహారంగా సుధాకర్ రెడ్డికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

నేడు ఏపీపీఎస్సీ పరీక్షల హాల్ టికెట్ల విడుదల

తిరుపతి సిటీ : ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించనున్న పరీక్షల హాల్ టికెట్లు బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ఈనెల 15 వ తేదీ నుంచి 23 వరకు పరీక్షలు జరగనున్నట్లు ఇప్పటికే ఏపీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది.

ఎర్ర చందనం కేసులో ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో చిత్తూరు జిల్లా, ఎర్రవారి పాలెం మండలం, కొత్తపల్లికి చెందిన ఎస్ బాలసుబ్రహ్మణ్యంకు ఐదేళ్ల జైలుశిక్ష, 6 లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్లు తెలిపిన వివరాల మేరకు... 2016 సెప్టెంబర్ 22వ తేదీ తలకోన సెంట్రల్ బీట్, నెరబైలు ఫారెస్ట్ అధికారులకు వచ్చిన సమాచారంతో గోడగలరేవు అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. నిందితుడు బాలసుబ్రమణ్యంతో పాటు మరికొంత మంది ఐదు ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా చేసి తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే సుబ్రహ్మణ్యం మాత్రం ఫారెస్ట్ సిబ్బందికి పట్టు పడగా, మిగతావారు పరారీ అయ్యారు. ఫారెస్ట్ అధికారులు నిందితుడు బాలసుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బాలసుబ్రమణ్యానికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

టీటీడీ ఏఈఓ సస్పెన్షన్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : టీటీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ బాబును సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ అధికార యంత్రాంగం పత్రికా ప్రకటన విడుదల చేసింది. రాజశేఖర్ బాబు ప్రవర్తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. స్వగ్రామమైన పుత్తూరులో రాజశేఖర్ బాబు ప్రతి ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నారని ఆరోపణల మేరకు టీటీడీ విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంతో టీటీడీ ఉద్యోగి అయిన ఆయన హిందూ ధార్మిక సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని గుర్తించింది. హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగి అయి ఉండి బాధ్యతారహితంగా వ్యవహరించారనే అంశాలను పరిగణించింది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. అనంతరం నిబంధనల ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

తండ్రిపై కత్తితో కొడుకు దాడి

తిరుపతి క్రైమ్: తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు, స్థానికుల కథనం.. ఐరాల మండలం గురువారంపల్లెకు చెందిన బాబు తిరుపతిలోని డీబీఆర్ హాస్పిటల్స్ సమీపంలో ఓ ప్రైవేట్ సంస్థ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అక్కడ సమీప ప్రాంతంలో అద్దె ఇంట ఉంటున్నాడు. అయితే కుటుంబంలో గొడవలు రావడంతో అతని చిన్న కుమారుడు సంతోష్, బాబు పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి గొడవ పడ్డాడు. తండ్రిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో అయనకు మోకాలిపై తీవ్ర గాయమైంది. స్థానికులు ప్రభుత్వ రుయా ఆసుపత్రికి తరలించారు.

బీఓబీలో కనీస బ్యాలెన్స్ చార్జీల నిబంధన రద్దు

తిరుపతి అర్బన్ : బ్యాంక్ ఆఫ్ బరోడా సేవింగ్స్ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ చార్జీల నిబంధన రద్దు చేస్తున్నట్లు ఈడీ బీనా వహిద్ నుంచి ఆదేశాలు వచ్చాయని జిల్లా రీజనల్ మేనేజర్ పి.అమరనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. జులై 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయని ఆయన స్పష్టం చేశారు.ప్రామాణిక పొదుపు ఖాతాలలో కనీస బ్యాలెన్స్ నిర్వహించని వారిపై చార్జీలను మాఫీ చేయడం ద్వారా కస్టమర్ – స్నేహ పూర్వక చొరవను ప్రకటించినట్లు పేర్కొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయ స్థాపనకు కేంద్రం సంసిద్ధం

- తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి లేఖకు స్పందన


మద్దిల గురుమూర్తి, ఎంపీ

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి అభ్యర్థనపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు సంసిద్ధత తెలియజేసింది. ప్రతి జిల్లాలో ఒక్కో జవహర్ నవోదయ విద్యాలయాన్ని స్థాపించాలనే ఉద్దేశంతో ఉన్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన రెండు జిల్లాలలో ఒకటైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 1986–87 నుంచే జవహర్ నవోదయ విద్యాలయం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, అయితే 2022 ఏప్రిల్ 3న కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ఇప్పటికీ నవోదయ విద్యాలయం లేదని, దీని స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని, అలాగే నూతన పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనాన్ని ఉచితంగా అందుబాటులో ఉంచాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాలో కూడా ఆయా ప్రమాణాలకు అనుగుణంగా పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం వెల్లడించింది. మరోవైపు– రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన జిల్లాలలో జవహర్ నవోదయ విద్యాలయల స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి దీనికి అవసరమైన భూ కేటాయింపులు చేయాలని ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి చేశారు.

నకిలీ పట్టాలతో భూ ఆక్రమణలు


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- మాజీ మంత్రి ఇంటిపై దాడి హేయం
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : అక్రమాలు..అరాచకాలు..దౌర్జన్యాలు.. భూ కబ్జాలకు వెంకటగిరి నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంపై దుండగలు విధ్వంసం సృష్టించడం దారుణమన్నారు.

వసూళ్ల సంస్కృతికి శ్రీకారం

అక్రమాలు, దౌర్జన్యాలు, వసూళ్లు వెంకటగిరిలో శ్రీకారం చుట్టాయన్నారు. ప్రతి పనికి ఓ రేట్ ఫిక్స్ చేసి మెనూ కార్డు ప్రకారం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని రామ్‌కుమార్ విమర్శించారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఖాళీగా జాగా కనిపిస్తే యథేచ్ఛగా భూ ఆక్రమణలు జరుగుతున్నాయని విమర్శించారు. స్థానికంగా ఉండి విశ్రాంతి పొందిన తహసీల్దార్ రాత్రి.. పగలు తేడా లేకుండా నిరంతరం కూటమి నేతల కనుసన్నల్లో సేవలు అందించారని ఆరోపించారు. దొంగ పట్టాలను సృష్టించి అమాయకులకు విక్రయాలు చేసిన దళారులతో పాటు విశ్రాంతి పొంది ఇంట్లో ఉన్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళారుల మాటలు విని దొంగ పట్టాల భూములను ఎవ్వరూ కొని మోసపోవద్దని వెంకటగిరి ప్రజలకు ఆయన సూచించారు. వైఎస్సార్‌సీపీ బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వెంకటగిరిలో భూ ఆక్రమణలు పెట్రేగిపోతున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ కూడా కూటమి నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పద్మశాలీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, మహిళా విభాగం కార్యదర్శి కాటూరు రామతులసి, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్లు రవికుమార్ యాదవ్, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆర్టీఐ విభాగం రాష్ట్ర కార్యదర్శి సదానందరెడ్డి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలి

డక్కిలి : డక్కిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఆశా డే సందర్భంగా డక్కిలి పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలోనే గర్భిణులకు ప్రసవాలు జరిగేలా వైద్యులు పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు యోగ క్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఆశాలకు ప్రస్తుతం జరిగే ఆరోగ్య కార్యక్రమాలైన టీబీ ముక్త్ భారత్, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు, డయేరియా తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీలో మందులు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి హరిత, వైద్యాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

చంద్రగిరిలో క్రీడలకు శిక్షణ

- ఒలింపియన్ స్పోర్ట్ అథారిటీ డైరెక్టర్ రజనితో కలెక్టర్ సమీక్ష

తిరుపతి అర్బన్: క్రీడల అభివృద్ధికి పునాదులు వేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఒలింపియన్ స్పోర్ట్ అథారిటీ డైరెక్టర్ రజనితోపాటు అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. క్రీడారంగంలో ఆసక్తి ఉన్న 6–8ఏళ్ల విద్యార్థులను గుర్తించి, చంద్రగిరిలో వారికి వసతులు కల్పించడంతోపాటు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆగస్ట్ మొదటి వారంలో వారికి పోటీలు నిర్వహించడానికి ఎస్సీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడారంగంలో విద్యార్థులను ప్రోత్సహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై క్రీడాకారిణి రజని పలు సూచనలు చేశారు. ప్రధానంగా హాకీ, కబడ్డీ, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు రాణించడానికి తీసుకోవాల్సిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డీఎస్‌డీఓ శశిధర్, ఆంధ్ర హాకీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి, హాకీ కోచ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన సుబ్రమణ్యం ఆచారి

రామచంద్రాపురం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంకు చెందిన సుబ్రమణ్యం ఆచారి(50) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయల్దేరాడు. గంగిరెడ్డిపల్లి వద్ద వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు.ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం ఆచారికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యలో సుబ్రమణ్యం ఆచారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి గోడు వినరే!

- గిట్టుబాటు కాని మామిడి
- మాయమైన ప్రభుత్వ మద్దతు ధర
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- ఆదుకోవాలంటూ విన్నపాలు
- పట్టించుకోని కూటమి నేతలు



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ సారి ఆశించిన స్థాయిలో పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధర లేక కుంగిపోతున్నారు. కనీసం కాయలు కొనుగోలు చేసేవారే లేకపోవడంతో రోడ్డుపాలు చేస్తున్నారు. ఫ్యాక్టరీల ఎదుట బారులు తీరి కనిపిస్తున్నారు. ర్యాంపుల్లో మామిడిని దింపుకునే నాథుడే లేకుండా పోయారు. ఇక చేసేది లేక ఏళ్లకాలంపాటు సాగుచేసుకుంటున్న మామిడి చెట్లను తెగనరికేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరపై రగిలిపోతున్నారు. మొదట కిలో రూ.12 అని చెప్పి మోసం చేశారని మండిపడుతున్నారు. ఇప్పుడు కిలో మామిడి ధర ఎంతో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. తమను ఆదుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట నోటికొందకుండా పోయిందని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. – కాణిపాకం


మామిడి ఫ్యాక్టరీ ఎదుట బారులు తీరిన ట్రాక్టర్లు


అన్‌లోడ్ కోసం ఎదురు చూస్తున్న రైతులు

ఈ ప్రభుత్వంతో ఒరిగిందేమీ లేదు



2018లో ఇలానే అల్లాడిపోయాం. అప్పుడు కాయలు కొనే వారు లేక చెట్లల్లోనే వదిలేశాను. ఈ సారి కాయలు అడిగే వారు లేరు. బలవంతంగా ఫ్యాక్టరీలకు తోలుకుంటున్నాం. ఫ్యాక్టరీ రేటు తోతాపురి రూ.8 అని ప్రకటించాయి. ఎక్కడ ఆ రేటుకు కొనుగోలు చేస్తున్నారు..?. కానీ ఫ్యాక్టరీలను ఏం చేయలేక పోతోంది. సీఎం, మంత్రులు అలా వచ్చి...ఇలా వెళ్లిపోయారు. –సాము, చిత్తూరు మండలం

ఒక్క పంటకూ దిక్కులేదు



చక్కెర ఫ్యాక్టరీ మూయించిన ఘనత చంద్రబాబుదే. దీనికి ముందు పాల ఫ్యాక్టరీని మూయించారు. ఇదే మాదిరిగానే మామిడి రైతులను ముంచేయాలని చూస్తున్నట్లు ఉంది. ఈ అవస్థలు ఎవరికి చెప్పుకోవాలి. చెరుకు పండించి బెల్లం తయారీ చేస్తే ఆంక్షలు పెడుతున్నారు. వేరుశనగ పండిస్తే చేతికి అందే పరిస్థితి లేదు. ఇప్పుడు పంట మామిడి ఒక్కటే. –రాము, చిత్తూరు మండలం

మా గోడు ఎవరికి చెప్పుకోవాలి?



మాకు 8 ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు కాయలు వచ్చాయి. టేబుల్ రకాలు మాత్రం అమ్మిన కాడికి అమ్ముకున్నాం. దానికి కూడా ఈ సారి ధర లేదు. పులేరా రూ.4, బేనీషా రూ.5కు విక్రయించాం. తోతాపురి రూ.2కు అడుగుతున్నారు. ఈ పంట ఉన్న ఒకటే లేకపోయినా ఒకటే అనే నిర్ణయానికి వచ్చాము. పక్క రాష్ట్రాల్లో మామిడి పంట పడింది. ఇక్కడ మాత్రం గాల్లో దీపంలా ఉంది. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. –భక్తవత్సలంరెడ్డి, యాదమరి మండలం

మద్దతు ఉత్తి మాటే



మామిడి రైతులు ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో నెలరోజులుగా చూస్తున్నాం. రోడ్డు మీద అల్లాడుతున్నాం. ప్రభుత్వం మాత్రం మద్దతు ధరను జోరుగా ప్రకటించింది. ఆ ధర ఎక్కడ అమలవుతుందో చెప్పాలి. ఏ ఒక్క ఫ్యాక్టరీలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.8 అమలు కావడం లేదు. రూ.5, రూ.4, మళ్లీ ఎంత ఇస్తారో కూడా తెలియదు. రైతులు ఏంపాపం చేశారని ఇలా మోసం చేస్తున్నారో తెలియదు. పక్క రాష్ట్రంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మామిడి రైతులకు మేలు చేశారు. ఇప్పటకైనా గొప్పలు మాని.. రైతులకు మేలు చేయండి. –రమేష్‌యాదవ్, యాదమరి